ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వే

-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టటానికి అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, సిపిఓ శేఖర్, తదితరులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 28, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ సమగ్ర కుటుంబ (ఇంటింటి) సర్వే చేపడుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేల ప్రధాన ఉద్దేశం రాష్ట్రంలోని వెనకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ఈ సమగ్ర సర్వేను నిర్వహిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సిపిఓ) శేఖర్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో సర్వే ఎలా చేయాలి, డేటాను ఎలా సేకరించాలని, సర్వేలో ఎదురయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలని అనే విషయాలపై వివరంగ అదనపు కలెక్టర్ వివరించారు. ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఈబిలో ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. హౌజింగ్ లీస్టు అయిన ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించాలన్నారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటి వారితో గౌరవంగ, మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమాని నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగ ఉంచబడుతుందన్నారు. ఎన్యుమరేషన్‌లో నింపిన షెడ్యూల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. ఎన్యుమరేటర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్‌తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షించాలన్నారు. చేసిన ఎన్యుమరేషన్ సర్వేలో 10శాతం రాండంగ తీసుకుని కుటుంబాల డేటాను తనిఖీలు చేయాలన్నారు. సర్వే సమర్దవంతంగ నిర్వహించటానికి నిర్ణీత సమయంలో పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. ఆ తరువాత సర్వేపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

..వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న.. జిల్లా కలెక్టర్ గౌతమ్

..నవంబరు 6వ తేదీ నుంచి సమగ్ర సర్వే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లకు తెలియజేశారు. మంగళవారం నగరంలోని సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నిర్వాహించాలన్నారు. ఈ సర్వేను పకడ్బంధీగ నిర్వహించాలని సూచించారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా: చైర్‌పర్సన్

ఘట్‌కేసర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఘణాపూర్‌లోని పలు వీధుల్లో ఆమె పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కార్మికులు చేస్తున్న పారిశుద్య పనులను ఆమె పరిశీలించి హాజరు పట్టికను చూశారు. కార్మికులు విధులకు సకాలంలో హాజరై పరిశుభ్రత పనులు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. పట్టణం పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఇళ్ల పరిసరాల్లో వేసిన చెత్తను తొలగించాలని సూచించారు. మాజీ ఉపసర్పంచులు వేముల పరమేశ్‌గౌడ్, బోనకూర్తి అర్జున్, సిబ్బంది ముత్తయ్య, పరశురాం, ఎల్లయ్య, వివేక్, శారద తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

పేలుళ్లపై విచారణ చేస్తాం

-షాద్‌నగర్ ఎసిపి ఎన్.సి.హెచ్.రంగస్వామి

షాద్‌నగర్ అక్టోబరు 29 ప్రభాతవార్త : పట్టణంలోని బాలాజీ టౌన్‌షిప్ కాలనీ సమీపంలో జరుగుతున్న పేలుళ్ల వ్యవహారంపై స్థానికుల ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ ఏసీపీ ఎన్.సి.హెచ్.రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్ మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చౌడమ్మగుట్ట వద్ద రాత్రింబవళ్లు పెద్దఎత్తున బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు మరోసారి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో బ్లాస్టింగ్ నిర్వాహకులను ఏసీపీ రంగస్వామి పిలిచి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి అభద్రతాభావం రాకుండా నిబంధనలకు అనుగుణంగా పనులు చేసుకోవాలని సూచించారు. అర్ధరాత్రి, మిట్టమధ్యాహ్నం సమయాల్లో చౌడమ్మగుట్ట వద్ద భారీ పేలుళ్లు చేయడంతో బాలాజీ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న ప్రజలంతా భయాందోళనకు గురవుతున్నామని, తమకు ఈ బ్లాస్టింగ్ బాధ తప్పించాలని కోరారు.

పుట్టగొడుగుల్లా ...సెల్ టవర్లు

-ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
-కనిపించని ఊర పిచ్చుకల జోరు
-పట్టించుకోని అధికార గణం

నందిగామ అక్టోబరు29,ప్రభాతవార్త :

పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది నందిగామ పరిస్థితి.ఇప్పటికే పరిశ్రమలు వదిలే జలవాయి కాలుష్యానికి ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు సెల్ టవర్లు ఏర్పాటు శాపంగా మారింది.మారుమూల గ్రామాల్లో సైతం విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా వెలుస్తుండడంతో ప్రజలు భయం భ్రాంతులకు గురవుతున్నారు.

నిబంధనలు గాలికి....

గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలంటే ప్రధానంగా జనవాసాలకు దూరంగా ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి.అవి ఏర్పాటు చేసే స్థలంలో స్థల యజమానితో పాటు చుట్టుపక్కల వారి అనుమతి అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకోవాలి.ఆ తర్వాత జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేసేందుకు గ్రామపంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వాలి.అలాంటివి ఏమీ లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కి యద్ధేచ్ఛగా ఏర్పాటు చేసుకుంటూ సోము చేసుకుంటున్నారు.

ఫ్రీక్వెన్సీని తగ్గించడ లేదు.

సెల్ టవర్లు నుంచి రేడియేషన్ అధికంగా రాకుండా వాటి ఫ్రీక్వెన్సీని తగ్గించాలి కానీ అలాంటివి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.పరిసరాల్లో ఎవరికైనా ఆరోగ్యకరమైన ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదులు వస్తే వాటి అనుమతిని రద్దు చేయాలని నిబంధనలు ఉన్నా అలాంటివి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాఠశాలలు ఉన్నచోట ఏర్పాటు చేయద్దు

సెల్ టవర్ల నిర్వాహకులు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలలకు సమీపంలో ఏర్పాటు చేయకూడదని నిబంధన ఉంది. ముఖ్యంగా గ్రామాల్లో సర్వే జరిపించి చుట్టుపక్కల వారికి ఎదురవుతున్న ఆరోగ్యకర ఇబ్బందులు తెలుసుకొని వాటి అనుమతులు రద్దు చేయడం లేక ఫ్రీక్వెన్సీ తగ్గించడం చేయాలి

రంగాపూర్‌లో ఓ ఇంటిపై వెలిసిన సెల్ టవర్,

ఆరోగ్యకర సమస్యలు

సెల్ టవర్ల ఏర్పాటుతో వాటి నుంచి వెలువడే అధిక రేడియేషన్ వల్ల ప్రజల మొదడు,కీళ్లు,నాడి ,చర్మం,నిద్రలేమి, చెవి,కంటి, సంతానోత్పత్తి,క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు మేధావులు శాస్త్రవేత్తలు చెప్తున్నారు.మనుషులతో పాటు పర్యావరణం,పక్షులు,జంతువులపైన వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది.ఇలాగే ఉంటే గ్రామాల్లోని పిచ్చుకలను సైతం జూపార్క్‌లో చూడాల్సిన పరిస్థితి దాపురించే పరిస్థితులను లేకపోలేదు.

అడ్డగోలుగా అనుమతులు...

సెల్‌ఫోన్ సంస్థలు ఇస్తున్న అడ్వాన్సులు,కిరాయిలకు ఆశపడి భవనాలు యజమానులు టవర్లకు అనుమతులు ఇస్తున్నారు.ఇంటి యజమానులే పంచాయతీల నుంచి అనుమతులు తెచ్చి ఇస్తుండడంతో నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్లు వెలుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రమైన నందిగామ,నర్సప్పగూడ,మేకగూడ,రంగాపూర్,నందిగామ మండల చుట్టున్న ప్రదేశాలలో సెల్ టవర్లు ఏర్పాటుతో ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి.సెల్ టవర్లకు అనుమతించొద్దు జనావాసాలకు దూరంగా పెట్టేలా చూడాలని గతంలో నర్సప్పగూడ, నందిగామ గ్రామ యువకులు జిల్లా ఉన్నతాధికారులకు ,స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం కాన రాలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు,ప్రజల ,పశుపక్షాదుల ఆరోగ్య సంరక్షణ విషయమై ప్రత్యేక చొరవ తీసుకొని సెల్ టవర్లకు అనుమతి ఇవ్వద్దని ,ఆరోగ్యకర సమస్యలు ఉత్పన్నమయ్యే గ్రామాలలో ఉన్న సెల్ టవర్లను రద్దు చేయాలని కోరుగున్నారు.



నర్సప్పగూడలో ఏర్పాటు చేసిన సెల్ టవర్

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేద్దాం

-జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

పభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంను అర్హులకు అందేలా అధికారులుగా మనం కృషిచేదామని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఇంటింటి సర్వే నిర్వహించే సూపరింటెండెంట్లకు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా ప్రణాళిక అధికారులతో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముందుగా నూతనంగా ఈ జిల్లాకు కలెక్గర్‌గా రావడంతో సంతోషం అన్నారు. జిల్లాలో విధులు నిర్వహించడానికి అవకాశం రావడం, ఈ అవకాశాన్ని నిర్వీర్యం చేయకుండా ఇంకా బాధ్యతగా చేయడానికి ప్రత్యేకంగా రాష్ట్ర రాజధానికి అనుకోని ఉన్న మన జిల్లాకు అధికారిగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే తరుణంలో జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన బాధ్యతను నిర్వీర్యం చేయకుండా బాధ్యతతో ఉద్యోగం నిర్వహిస్తే ప్రభుత్వంలో వారు పై స్థాయి ఉద్యోగులుగా ఎదుగుతారన్నారు. మన జిల్లాలో ప్రభుత్వం నుండి అమలు చేస్తున్న ప్రతి పథకంను గ్రామం నుండి పట్టణం వరకు ప్రతి స్థాయి పౌరులకు అందేలా కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి జిల్లా ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా వారి బాధ్యతను గుర్తుచేసుకుంటూ ప్రతి పౌరుడికి సేవకులమై సేవలందించాలన్నారు. ప్రైవేటు ఉద్యోగంలో ఆర్థికంగా ఎదిగిన ఒకనొక స్థాయిలో చేసే తప్పులతో ఉద్యోగాల నుండి తొలగి రోడ్డున పడే వ్యవస్థలోకి వెళ్లిపోతాం అన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగిగా మనకు అందిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ఎలాంటి తప్పులు దర్లొకుండా,ఉద్యోగిగా ఏమరుపాటుతో, నిర్లక్షధోరణిలో ఉంటే వారికి ప్రభుత్వం నుండి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి ఉద్యోగి తనతోటి ఉద్యోగులతో కలిసిమెలిసి విధులు నిర్వహిస్తూ, జిల్లాలో 100 శాతం టీమ్ వర్క్‌తో జిల్లాను అభివృద్ధి చేసే దిశగా తోడ్పడాలన్నారు. అనంతరం కలెక్టర్ ట్రైనింగ్‌లో పాల్గొన్న ఎన్యూమరేటర్, ఎంపిడిఓ, మున్సిపల్ కమీషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ... సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బంధీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సర్వేకోసం ఎన్యూమరేటర్లు, ఎన్యూమరేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలం వారీగా ఎంపిడివో, తహసీల్దార్ ఎన్యూమరేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్ వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్లకు ఆదేశించారు. రెవెన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీలో విలీనం కావడంలో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహన కోసం ఎన్యూమరేటర్లకు సంబంధించిన ప్రత్యేక శిక్షణను ట్రేనర్స్ ఆఫ్ ట్రేనర్స్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే పనిని వేగంగా మరియు విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎన్యూమరేటర్లను ఎంపిక చేయాలని, అవసరమైతే అదనంగా 10 శాతం ఎన్యూమరేటర్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా ఎంత తర్వగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మండలం వారీగా ఎంత జనాభా ఉంది. ఎంత మంది ఎన్యూమరేటర్లు, ఎంత మంది సూపర్‌వైజర్లు, మున్సిపల్ పరిధిలో ఎన్ని వార్డులు ఉన్నవి, ప్రస్తుం వార్డు వారిగా ఎలా చేస్తున్నారని, మున్సిపల్ కమీషనర్‌లు, ఎంపిడివోలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక డేటాలను ఈ నెల 30వ తేది వరకు అందించాలని అన్నారు. అనంతరం పూర్తి స్థాయిలో డేటాను కనీసంగా నవంబర్ 1వ తేదిలోపు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్‌లు పిపిటి ద్వారా సర్వే ఏ విధంగా చేయాలన్నది అందరికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో సంగీత, జిల్లా ప్రణాళిక అధికారి పి. సౌమ్య, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి.

సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు.

పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలి

-టీఎస్ సిపిఎస్ఈయు రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ

వికారాబాద్ రూరల్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టిఎస్ సిపిఎస్ఈయు రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్ హాల్లో టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇస్తామన్నా పాత పెన్షన్ విధానంను వెంటనే అమలు జరిగేలా చూడాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా సామాజిక - భద్రత లోపిస్తున్న సీపీఎస్ ను రద్దు చేయాలన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధికంగా భారంగా మారనున్న కంట్రీ బ్యూటరీ పెన్షన్స్ స్కీం విధానం పట్ల తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, చత్తీస్ ఘడ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని, మన రాష్ట్రంలో కూడా పునరుద్ధరించాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎ ్నకున్నారు. ఈ కార్యక్ర మంలో మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, రాష్ట్ర సెల్ కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర సాహిత్య సభ్యులు మురహరి, అన్ని మండలాల ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి

వికారాబాద్ రూరల్, అక్టోబర్ 29, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు మంగళవారం రీలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ, విద్యాకేంద్రంగా ఉన్న వికారాబాద్ జిల్లా కేంద్రంలో పోరాటం చేసి డిగ్రీ కళాశాల సాధించుకున్న, పక్కా భవనం లేకపోవడం విడ్డూరంగా ఉందని వ్యాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల పక్కా భవనం లేక పోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పక్కా భవనం నిర్మించే వరకు రీలే నిరాహారదీక్ష చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏబీవీపీ జిల్లా కన్వినర్ హరీష్‌రావు, పట్టణ కార్యదర్శి మహేష్ నాయకులు కె.శివ ప్రసాద్, డి.దయాకర్, ఏ.సాయి తేజ, కే. సాయికుమార్, ఏ.విష్ణువర్ధన్. వి.రాందాస్, బాలరాజు, బాలు, సి.సంతోష్, సి.రామకృష్ణ, జి.కార్తీక్, ఎం.నరసింహా, కే.శ్రీ ను పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన

.అలియాబాద్ గ్రామంలో గ్రామసభను నిర్వహించి మహిళలకు ఆరోగ్యం,పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించిన ఇసిఐఎల్ టీమ్ ప్రతినిధులు,పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కె.కృష్ణారెడ్డి, తదితరుల దృశ్యం

శామీర్‌పేట, అక్టోబరు 29, ప్రభాతవార్త

మహిళలు ఆరోగ్యం పట్ల, పరిశుభ్రత పట్ల అవగాహన కల్గి ఉండాలని ఇసిఐఎల్ టీమ్ ప్రతినిధులు సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఇసిఐఎల్ టీమ్ వారు మహిళలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. గ్రామంలో, ఇళ్ల పరిసరాల్లో, ఇళ్లల్లోనూ పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగ టెక్నాలజీ విషయంపై కూడ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మారుతున్న సమాజం బట్టి సాంకేతిక రంగంలోనూ మార్పులు అవసరమన్నారు. టెక్నాలజీని పెంపొందించుకోవాలని వారు సూచించారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ యాదగిరిరెడ్డి సూచనలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామసభ ద్వారా మహిళలకు అవగాహన కల్పించటం జరిగిందని ఇసిఐఎల్ ప్రతినిధి బృ:దం వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు మాజీ ఉపసర్పంచు కె.కృష్ణారెడ్డి, గ్రామ నాయకులు టి.కుమార్, ఎం.సంజీవరెడ్డి, ఎం.మల్లేశ్, ఎం.వీరారెడ్డి, ఎం.యాదయ్య, పి.బిక్షపతి, డ్వాక్రా మహిళలు, ఆశవర్కర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి అండగా ఉండాలి

-టిపిసిసి మెంబర్ శాబాద్ దర్శన్

మొయినాబాద్, అక్టొబర్ 29, ప్రభాతవార్త : చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు, ముఖ్యమంత్రిని మొయినాబాద్‌కు చెందని తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర టిపిసిసి మెంబర్ శాబాద్ దర్శన్ మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పా జంక్షన్ నుండి మన్నేగూడ వరకు ఉన్న బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు వేగంవంత చేసినందుకు, నిత్యం చేవెళ్ల నియోజకవర్గం ప్రజలు రోడ్డు విస్తరణలేకా తీవ్ర ఇబ్బందులపడుతున్నారని, మొయినాబాద్ నుండి చేవెళ్ల వరకు ఇంకా రోడ్డుపనులను వేగవంతం చేయాలని ఆయనను మర్యాదపూర్వకంగా కోరడం జరిగిందన్నారు, రెడ్డిపల్లి గ్రామం నుండి వయా మొయినాబాద్ టు వెంకటాపూర్ గ్రామీణ రోడ్డు నుండి ఆర్‌ఆండ్‌బి రోడ్డు గాచేసి ప్రత్యేకంగా మొయినాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపానన్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాపాలన నడుస్తుందని, ముఖ్యమంత్రి రాష్ట్రంపై భేష్ అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కార్యాక్రమం తీసుకున్నా, అది నిరుపేదలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు, కాంగ్రెస్ అధికారంతోనే చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధిలో ముందు ఉంటుందన్నారు, రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పార్టీ కనీసం గ్రామాలకు వెళ్లడానికి రోడ్లు వేయలేదని, కాంగ్రెస్ వచ్చిన ఒక్క సంవత్సరంలోనే అభివృద్ధి వైపు దుసుకేళ్తుందన్నారు,

15 వేలకు చేరిన బిజెపి సభ్యత్వ నమోదు

మొయినాబాద్, అక్టొబర్ 29, ప్రభాతవార్త : మొయినాబాద్ మండలంలో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు 15వేలకు చేరిందని, ఇది కార్యాకర్తల కష్టపడిన ఫలితమని మధుసుదన్ రెడ్డి అన్నారు, మంగళవారం మండలంలోని కనకమామిడి గ్రామంలో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి దేశంలోనే అత్యధికంగా సభ్యత్వనమోదు కలిగిన పార్టీగా బిజెపి పార్టీ మరోసారి నిరుపిస్తుందని, ఆ విధంగా పార్టీ కార్యాకర్తలు రాత్రి పగులు అలుపేరుగకుండా శ్రమిస్తున్నందుకే ఆ విధంగా సభ్యత్వ నమోదులో పళితాలు వస్తున్నాయన్నారు, వచ్చే స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటీసీలు పూర్తిగా బిజెపి పార్టీ గెలిచేవిధంగా దేశ ప్రధాని నరేంద్రమోడి పాలనను ప్రజలకు వివరిస్తు మోడి పాలనలో దేశ భద్రత, అభివృద్ధి పై అవగాహన కల్పించడంతో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వ నమోదు తీసుకోవడమే కాకుండా, ఇతరులకు కూడ పార్టీ యొక్క సిద్ధాంతాలను వివరిస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు, ఈ కార్యాక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు మొర నర్సింహారెడ్డి, కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ యాదయ్య యాదవ్, శ్రీనివాస్ నాయి, ఎస్సి మోర్చ మండల అధ్యక్షుడు జె. వెంకటేష్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు లక్ష్మిపతి యాదవ్, బూత్ అధ్యక్షుడు శ్రీధర్, వన్నాడి శివకుమార్, రవిందర్ రెడ్డి మహేందర్ రెడ్డి, భీంచెందర్ గౌడ్ తధితరులు పాల్గొన్నారు,

కాంట్రవర్సీలు వద్దు

-మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలకు తావులేదు

-బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఈశ్వర్ రాజు, నర్సింహ్మ

షాద్‌నగర్, అక్టోబరు 29 ప్రభాతవార్త, :

మున్సిపాలిటీ పాలనా సమయం రెండు నెలల్లో ముగుస్తుందని, ఇలాంటి సమయంలో అందరు కలిసి మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని బీఆర్ఎస్ పట్టణ కౌన్సిలర్లు బచ్చలి నర్సింహ్మ, ఈశ్వర్ రాజులు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సాధారణ సమావేశం విషయంలో వారు స్పందించారు. సర్వసభ్య సమావేశానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సమాచారం అందించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించిన విధంగా మున్సిపాలిటీలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగలేదని తెలిపారు

జిల్లా అదనపు కలెక్టర్‌గా నగేష్ బాధ్యతలు స్వీకరణ

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసిన అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి కృషిచేస్తానని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులైన మెంచు నగేష్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నగేష్ మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతమైన పాలనలో కలెక్టర్ సూచనలు, సలహాలు పాటిస్తూ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు విశేష కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నర్సాపూర్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన మహిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అదనపు కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నగేష్‌కు కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూల బొకేలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు.

గడిపెద్దాపూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా

అల్లాదుర్గం, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

ప్రభుత్వ భూములు కానవస్తే కబ్జా చేసేందుకు అక్రమార్కులు సిద్ధంగా ఉంటూ కబ్జా చేసుకుంటున్నారు. కబ్జాకోరులు ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కబ్జాకోరులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతోంది. మండల పరిధిలోన గడిపెద్దాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని కబ్జాచేశారని, ప్రభుత్వభూమిని కాపాడా లంటూ గ్రామానికిచెందిన యువత తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. గ్రామ శివారులోని 863/1/1 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురయిందని యువత ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో యువత ఆటలాడుకుంటూ ఉండగా కొందరు రాజకీయ ముసుగులో స్థలాన్ని కబ్జా చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించి యువత క్రీడలు ఆడుకునేందుకు ఉపయోగించేలా చూడాలని వినతి చేశారు. గ్రామ శివారులో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి కబ్జా నుంచి భూమిని విడిపించాలని యువత డిమాండ్ చేస్తోంది.

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్స వేడుకలను విజయవంతం చేద్దాం

జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 29, ప్రభాతవార్త :

ఏఐటియూసి 105వ ఆవిర్భావ దినోత్స వేడుకలను విజయవంతం చేద్దామని జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన ఏఐటియూసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల కష్టాలకు అండగా నిలవడానికి 1920 ముంబాయి నగర నడి సముద్రంలో సమావేశంమై ఏఐటియూసిగా నామకరణం చేసి 105 ఏళ్లు పూర్తిచేసుకున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియూసి అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఏఐటియూసి పోరాడి సాధించిన కార్మిక చట్టాలు అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఏఐటియూసి కార్మికులకు అండగా నిలుబడి సమస్యల సాధనకు పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో ఏఐటియూసి నాయకులు పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, తయుసుపల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చౌట్కూర్‌లో పొగమంచుతో కప్పుకున్న జాతీయ రహదారి

పొగమంచు కప్పుకున్న జాతీయ రహదారి

చౌట్కూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: మండల కేంద్రంలో చలి తీవ్రత పెరిగింది. రోడ్లు దట్టమైన పొగంచుతో కప్పుకున్నాయి. మంగళవారం ఉదయం 7 గంటలు దాటినా పొగమంచు తగ్గడంలేదు. జాతీయ రహదారి 161పై వాహనదారులు పొగమంచుతో ఎదురుగా ఏముందో తెలియక ఇబ్బందులపడ్డారు. పొగమంచు కురుస్తుండడంతో రైతులు సాగు చేసుకుంటున్న కంది, మిరప పంటలు చీడపీడలకు సోకి తెగుళ్ల బారిన పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా సర్వే పక్కాగా చేపట్టాలి

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర అధికారులు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాలో కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టరేట్ నుండి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాహుల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. సర్వేకి వెళ్లే ఎన్యుమరేటర్‌కి ఒక ఐడీ కార్డు జారీ చేస్తామని, మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫైనల్ ఫార్మాట్‌కి అనుగుణంగా సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు మహిపాల్ రెడ్డి, రమాదేవి, జయచంద్రా రెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీరామ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్ కలెక్టరేట్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో హైదరాబాద్ ఎలక్షన్ సీఈవో కార్యాలయంలో పనిచేసి బదిలీపై జిల్లాకు వచ్చారు. జిల్లాపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్నివర్గాల ప్రజలకు సమర్థవంతంగా అందేలా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇక్కడ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఎంఎస్ఆర్ యువసేన సేవలు విస్తరించాలి

-మంత్రి దామోదర రాజనర్సింహ

కొల్చారం, అక్టోబరు 29 ప్రభాతవార్త: ఎంఎస్ఆర్ యువసేన సేవలను నర్సాపూర్ నియోజకవర్గంతో పాటు ఆందోల్ నియోజకవర్గానికి విస్తరింప చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహను కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు సాయిచరణ్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహను సాయిచరణ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఎంఎస్ఆర్ యువసేన సేవలను నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆందోల్ నియోజకవర్గానికి విస్తరింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలి

పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.చౌహాన్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.చౌహాన్ సూచించారు. ధాన్యం కొనుగోలుపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసి మాట్లాడారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి మిల్లింగ్‌లో సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కడ మిల్లింగ్ తక్కువగా జరుగుతుందో తెలుసుకొని అక్కడ తనిఖీలు నిర్వహించి మిల్లింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగినట్లు తెలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు కొనుగోళ్లు చేయాలన్నారు. ఎవైనా ఇబ్బదికర సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఎస్ఓ తనూజ, తదితరులు

రైతులకు అండగా ఉంటాం

రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త

పార్టీలకతీతంగా రైతులకు అండగా ఉంటామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పోతారం(ఎస్) గ్రామంలో ఆర్‌కె జిన్నింగ్ మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ) ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే కేంద్రంలో ఉన్న రాష్ట్ర ప్రతినిధులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రంలో ఉన్న 322 పత్తి కొనుగోలు కేంద్రాలలో సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కొనుగోళ్లు వచ్చే సెప్టెంబరు వరకు జరుగుతాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పత్తిలో తేమ శాతం నిబంధనలకు లోబడి ఉంటే మద్దతు ధర రూ. 7500 పొందవచ్చన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో ఉన్నందున ముగ్గురు కలెక్టర్లు ధాన్యం,పత్తి కొనుగోలు విషయాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు ప్రక్రియ ఏవిధంగా సాగుతోందని ప్రతీ రోజు మానిటరింగ్ జరుగుతుందన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. ఇక ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇది వరకే ప్రారంభమయ్యాయని కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల వద్ద సేకరించిన ధాన్యానికి సంబందించి 20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లకు ఇంకా కేటాయింపు జరగలేదని, జీరో డ్యూటీ ఉండి ప్రభుత్వానికి మంచిగా కేటాయింపు జరుగుతోందన్నారు. మిల్లర్ల కేటాయింపుతో పాటు 60 నుండి 70 శాతం వరకు మంచిగా చేసిన వారికి 10 శాతం బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి అవకాశం ఇస్తామన్నారు.ఇప్పటి వరకు కొనుగోల్ల విషయంలో మిల్లర్లకు కేటాయింపు జరగలేదని,దీని ద్వార ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆగదని స్పష్టం చేశారు.

మార్కెట్ గోదాంను సందర్శించిన కలెక్టర్...

హుస్నాబాద్‌లోని ఆధునిక వ్యవసాయ మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత సెంటర్ల నుండి లారీల్లో గోదాంకి వచ్చిన వెంటనే దిగుమతి చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి జైను లొద్దీన్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎఎంసి గోదాంలో మొత్తం 6 షెడ్లకు 1 షెడ్డు మాత్రమే ఖాళీగా ఉందని మిగతా షెడ్లలో ఏముందని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నందున షెడ్లు ఖాళీచేసే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, జిల్లా లైబ్రరీ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి,కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే విషయంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా మధిర మండల తహసీల్దార్ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం నుండి రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరిలు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని, ఈ కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు ఇది గొప్ప అవకాశం అన్నారు. కాన్ఫరెన్‌లో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి తదితరులు ఉన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

సౌత్ ఇండియా యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29,ప్రభాతవార్త : ఈ నెల 23వ తేదీన కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన కబడ్డీ పోటీలలో హుస్నాబాద్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు గడిపె సిద్దు, ఎండీ ఆల్ఫాజ్, కోయిలకరి శ్రీశైలంలు చెన్నైలో ఈనెల 30న జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ టీంకు ఎన్నికైనట్లు కబడ్డీ కోచ్ మడక కృష్ణ తెలిపారు.వీరి ఎంపిక పట్ల రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్నలు హర్షం వ్యక్తం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌వోసిని అందజేసిన ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సిఎంఆర్ఎఫ్ రూ. 2 లక్షల ఎల్‌వోసిని మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. వెల్దుర్తి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రవళ్లిక అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇందుకు గాను ఆమె ఆపరేషన్ నిమిత్తం రూ. 2 లక్షల అవసరమున్నందున సిఎంఆర్ఎఫ్ నుండి 2 లక్షలు మంజూరు కాగా అట్టి 2 లక్షల ఎల్‌వోసిని ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా బాదితులకు అందజేయడం జరిగింది అందజేయడం జరిగింది. అదేవిదంగా కౌడిపల్లి మండలం చందూర్ గ్రామానికి చెందిన పోచయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యానికిగురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన 27 వేలరూపాయిల చెక్కును హైద్రాబాద్‌లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి చేతుల మీదుగా అందించారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, రింగుల ప్రసాద్, జగపతి, తదితరులుపాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయడంతో పాటు సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలు నాయకులు సంగెం మధు,వేల్పుల ప్రసన్నకుమార్, మిట్టపల్లి సుధాకర్, జక్కుల అనిరుధ్, బాణోత్ నవీన్,రమేష్,రాజేందర్,శ్రావణ్, వర్శిత, రమ్య, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదె చంద్రం

రామాయంపేట, (చల్మెడ) అక్టోబర్ 29, ప్రభాతవార్త : అన్నదాతలు అహర్నిశలు కష్టపడి పండించిన పంటను ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులకు అమ్మి మోసపోవద్దని రామాయంపేట పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం సూచించారు. మంగళవారం నిజాంపేట మండలంచల్మెడ గ్రామంలో రామాయంపేట సొసైటీ చైర్మెన్ బాదె చంద్రం ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రంను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎపిఎసిఎస్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తొందరపడి రైతులు ఎవరు తమ పంటను దళారులకు అమ్మవద్దని తెలిపారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి తమ సంఘం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ పోచమ్మల ఐలయ్య,తాజా మాజీ సర్పంచ్ చప్పట నరసింహారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నంద్యాల మోహన్‌రెడ్డి, బాజ గౌరయ్య, సంఘీపు నారాయణ, కాకి రాజయ్య, భాగ్య నాగరాజు, బాజా రమేష్, నంద్యాల యాదవరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యువ కవి శ్రీకృష్ణగ్రిల్లర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

యువకవిని సన్మానించిన మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన యువ కవి శ్రీకృష్ణ గ్రిల్లర్..ఎందిరా ఈ పంచాయతీ అనే సినిమాలో తలిచె తలిచె అనే పాటను రాయగా పెద్దపల్లి రోహిత్ సంగీతం సమకూర్చగా ప్రముఖ సింగర్ సునీత ఈ పాటను పాడడం జరిగింది. నాన్నపై రాసిన ఈపాట అద్భుతంగా సోషల్ మీడియాలో సక్సెస్ కావడంతో స్పందించిన నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ శ్రీకృష్ణగ్రిల్లర్‌ను శాలూవాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్‌కు చెందిన శ్రీకృష్ణగ్రిల్లర్ కవిగా మారడం ఎంతో అనందంగా ఉందన్నారు.ఇకముందు ముందు ఇంకా ఎన్నో పాటలు రాయాలని అన్నారు. మంచి మంచి పాటలు రాసి నర్సాపూర్ పట్టణానికి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని, అదేవిధంగా కవిగా ఉన్నత ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంబళ్ళ రాంచందర్, కుమ్మరి నాగేశ్, యాదగిరి,నాయకులు గణేశ్‌గౌడ్, రామకృష్ణ, మల్లేష్, వెంకటేశ్, షరీఫ్, సల్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఒత్తిడి వల్లే ఫాంహౌజ్‌పై దాడులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ అస్థిత్వాన్ని దెబ్బతీయడానికే పాం హౌజ్‌పై ప్రభుత్వం దాడులు చేయించిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఫాంహౌజ్‌పై దాడిని తీవ్రంగా ఆమె ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో ప్రభత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్, బావమరిది ఫాంహౌజ్‌పై దాడులు చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి కెటిఆర్ బావమరిది గృహప్రవేశానికి సంబంధించి ఫాంహౌజ్‌లో ఏర్పాటు చేసిన విందులో భాగంగా మాజీ మంత్రి కెటిఆర్ కుటుంబ సభ్యులను ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంలో కెటిఆర్ అస్తిత్వాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం నుండి ఒత్తిడి రావడం వల్ల ఈ దాడి జరిగిందన్నారు. దాడుల సమయంలో ఎక్సైజ్ అధికారులు బయటకు వచ్చి మీడియా సమావేశంలో ఫాంహౌజ్‌లో ఎటువంటి మాదక ద్రవ్యాలు లేవని చెప్పడం జరిగిందన్నారు. ప్రతిపక్షాల నోరు నొక్కి వేయడానికి ప్రభత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి వెల్లడించారు.

మృతిచెందిన పాడిగేదె

విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి

జగదేవ్‌పూర్, అక్టోబరు 29 (ప్రభాతవార్త): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి పాడిగేదె మృతిచెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో జరిగింది.వివరాలిలా ఉన్నాయి. చాట్లపల్లి గ్రామానికి చెందిన గోక నర్సింలు పాడి గేదెను సోమవారం రాత్రి రోజులాగే పొలం వద్ద పశువుల పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం వెళ్లిచూడగా గేదె పొలానికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి మృతిచెంది ఉంది. పాడిగేదె మృతితో సుమారు రూ.70వేల వరకు నష్టం జరిగిందని, జీవనోపాధికి తెచ్చుకున్న గేదె మృతితో తనకు నష్టం జరిగిందని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని రైతు నర్సింలు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక, అక్టోబరు 29, ప్రభాతవార్త : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సిర్సనగండ్లలో మంగళవారం చోటు చేసుకుంది. త్రి టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన పొన్నం కొండయ్య(50), 10 నెలల క్రితం కూతురు అర్చన వివాహం చేశాడని, దానికితోడు మద్యానికి బానిసైన అతను మద్యం సేవించి గ్రామ శివారులోని ఊర చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి చెప్పుల ఆధారంగా సిద్దిపేట నుండి గజఈత గాళ్లను రప్పించి చెరువులో వెతకగా మృతుడు కొండయ్య మృతదేహం లభించనట్లు వారు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించి, మృతుడి తల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు వివరించారు. మృతునికి భార్య లక్ష్మి, కూతురు అర్చన ఉన్నారు.

పోలీస్ ఇంటికే కన్నం వేసిన దుండగులు

-ఎనిమిదిన్నర తులాల బంగారం, 30 తులాల వెండి అపహరణ

పెద్దశంకరంపేట, అక్టోబరు 29 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీల

మహిళలు స్థాపించిన యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

సెర్ప్ పిఎం ఉమాపతి

నంగునూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని సెర్ప్ పిఎం ఉమాపతి అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్ప్రైజేస్ గ్రౌండింగ్ వెరిఫికేషన్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రాంపూర్,సిద్దన్నపేట గ్రామాలలో సెర్ప్ అధికారులు, మహిళలు గ్రామాల్లో నెలకొలపుకున్న ఎంటర్ప్రైజేస్‌ను డీపీఎం కర్ణాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ప్‌హెల్ప్ గ్రూప్ మహిళలను బతోపేతం చేయడమే సెర్ప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళలు వ్యాపారంపై మెగ్గుచూపి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు వ్యాపారాలు నెలకొల్పుకోవడానికి బ్యాంకు,గ్రామ సంఘం స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా ముందుకు రావాలన్నారు.కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సీసీ మల్లేశం, వివోలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘన సత్కారం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న హరికృష్ణ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త: భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం హైదారాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పొన్నాల వై జంక్షన్ వద్ద సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. సిద్దిపేటలో పార్టీని మరింత పటిష్టంచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించినట్లు హరికృష్ణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం సైనికుల్లా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖలీం, పూజల గోపికృష్ణ, సందీప్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, మొహమ్మద్ అతిఫ్, చిన్న రశాద్, అజమాత్,రాజు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 29, ప్రభాతవార్త : చేర్యాల మండలం నాగపురి పరిధిలోని గండికుంటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను జనగామ డీసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, అందెనాని బాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మూరి...

చేర్యాల మండలం శభాష్‌గూడెంకు చెందిన విద్యార్థి గాడిపల్లి మనోజ్ గత ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని చనిపోగా మంగళవారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఆయనతో కాంగ్రేస్ పార్టీ నాయకులు,తదితరులు ఉన్నారు.

అందమైన చేతి రాత విద్యార్థుల భవిష్యత్‌కు పునాది

చేతి రాతపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొండపాక, అక్టోబరు 29, ప్రభాతవార్త : అందమైన చేతి రాతపై సిర్సనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మద్దుల గోపాలకృష్ణమూర్తి, సతీమణి మద్దుల తాయారమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మద్దుల వెంకటరమణ కోడలు స్వర్ణలత సహకారంతో అక్షరశిల్పి పురస్కార గ్రహీత గడ్డం యాదగిరితో పాటు స్వర్ణ నంది అవార్డు గ్రహీత గొట్టిముక్కల బ్రహ్మచారి, విద్యార్థులకు అందమైన చేతి రాతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనుసందానకర్తగా గణిత ఉపాధ్యాయుడు పుల్కూరు శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఎఎపిసి చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, పొన్నాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణ స్థలంపై వివాదం.. పోలీస్ పికెట్

కొండపాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త : తిమ్మారెడ్డిపల్లి మధిర సార్లవాడలో అసైన్డ్ భూమిలో చర్చిని నిర్మిస్తున్నారని కొంత మంది నిర్మాణాన్ని రెండు రోజుల క్రితం కూల్చివేయగా వారిపై కుకునూరుపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ విషయమై సోమవారం రాత్రి మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు నిర్మాణాన్ని కూల్చి వేసిన వారికి మద్దతుగా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని రాత్రాంతా హల్‌చల్ చేశారు, తమ కార్యకర్తలపై ఎందుకు కేసులు పెట్టారంటూ పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చిని ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. చర్చి నిర్మాణం జరిగిన ప్రదేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా కుకునూరుపల్లి పోలీసులు అక్కడ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వివాదాస్పద స్థలం వద్ద పోలీస్ పికెట్ నిర్వహిస్తున్న దృశ్యం

పేదలకు వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే

చేర్యాల, అక్టోబరు 29, ప్రభాతవార్త : పేదలకు ఏకైక సదుపాయం వైద్యం అని వారికి అన్ని విధాల వైద్యసేవలు అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి ప్రజలకు అన్ని రకాల సేవలందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెలే మాట్లాడుతూ రెండు నెలలుగా గైనిక్ వైద్యులు లేక పోవడంవల్ల కనీసం డెలివరీలు కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికే ప్రజలు రాని పరిస్థితుల్లో గత ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి 80 శాతం ప్రజలు ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకునేలా చేసిందని తెలిపారు. అలాగే తల్లి, పిల్లలు బాగుండాలని కేసిఆర్ కిట్లు, న్యూట్రేషన్ కిట్లు, రూ.12 వేలు గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అప్పటి ప్రభుత్వ హాయంలో శిశు,తల్లుల మరణాలు తగ్గాయని మళ్లీ ఇప్పుడు పెరిగాయన్నారు. రోజురోజుకు సౌకర్యాలు పెరగాల్సిందిపోయి తగ్గుతున్నాయని, పూర్తిస్థాయిలో డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ స్టాఫ్ లేరని వారందరిని నియమించాలని వైద్య మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సూపరింటెండెంట్ దేవేందర్ మున్సిపల్ వైర్‌పర్సన్ ఆంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్, కనకలక్ష్మి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు తాజా మాజీ ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, ముస్త్యాల బాల్‌నర్సయ్య, అనంతరుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపిపి శ్రీధర్, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు, సిద్దిరాములు, తిరుపతిగౌడ్, తాండ్ర సాగర్ ఉన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన పల్లా...

చేర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు బుడిగే విజయ ఇటివల అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఆయనతో బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

వరంగల్ రోడ్డు పనులకు హుస్నాబాద్ మట్టా...!?

బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త : నిజామాబాద్ నుండి వరంగల్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులకు కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కై ఎలాంటి అనుమతులు తీసుకోకుండా హుస్నాబాద్ మట్టిని తరలిస్తున్నారని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో ఆయన మాట్లాడుతూ పోతారం బైరాన్ చెరువు పక్కన ఉన్న సుందరమైనగుట్టలను పక్క జిల్లాలో నిర్మించే రోడ్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గుట్టలను తవ్వుతూ వణ్యప్రాణులు జనవాసాల్లోకి వచ్చేలా చేస్తున్నారన్నారు.గుట్టలు తవ్వకాలు మొదలైన నుండి వివిధ రకాల జంతువులు పోతారం, నాగారం గ్రామాలలోకి వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు స్పందించి గుట్టలు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బాలయ్య, సత్తయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా దీపోత్సవం

పటాన్‌చెరు, అక్టోబరు 29,ప్రభాతవార్త: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరబాద్ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం దీపోత్సవం పేరిట దీపావళి వేడుకలను ఉల్లాసభరితంగా, సృజనాత్మకతను చాటేలా నిర్వహించారు. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ప్రాంగణం లెక్కలేనన్ని దీపాల వెలుగులతో ప్రకాశించి, చీకటిపై కాంతి,చెడుపై మంచి విజయానికి ప్రతీకగా నిలిచింది. గీతం హైదరబాద్ ప్రాంగణమంతా ప్రతిధ్వనించే సానుకూల శక్తి, పండుగ ఉల్లాసాన్ని స్వాతిస్తే, దీపాల అద్భుత శక్తిని విద్యార్థులంతా కలిసి స్వీకరించారు. దీనికిముందు పర్యావరణ అనుకూలమైన దీపాలకు రంగులు వేయడం ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడమే గాక, పరిసరాలను రంగులమయం చేశారు. ఈ వేడుకకు రంగోలి పోటీ జతకలిసి విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. విద్యార్థులు క్లిష్టమైన డిజైన్‌లను ప్రదర్శించి, దీపావళి ఉత్సవాలలో అంతర్లీనంగా ఉన్న కళాత్మక స్ఫూర్తిని చాటి చెప్పారు. ఈ ఆహ్లాదకరమైన సంస్కృతుల కలయికలో స్పార్క్ అండ్ స్పిరిట్స్ పేరిట హాలోవీన్‌ను కూడ గీతం విద్యార్థులు నిర్వహించారు. భోగి మంటలు వెలిగించి, దెయ్యాలు పారద్రోలెందుకు సృజనాత్మకత దుస్తులను ధరించి,ఈ భయానక వేడుకలో పాల్గొన్నారు. దీపావళి, హాలోవీన్ ఉత్సవాల ఈ ప్రత్యేక సమ్మెళనం విద్యార్థులలో అనందాన్ని పెంపోందించింది.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు



మాట్లాడుతున్న అత్తు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చినమాట నిలబెట్టుకున్న ఘతన సిఎంనరేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు అర్థం,పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు డిఎలు పెండింగ్ పెడితే సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మూసినది సుందరీకరణకు సిఎం కృషి చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు.సమావేశంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, మధు, గయాజుద్దీన్, అనిల్, సంతోష్‌గౌడ్, చేపూరి సిద్దిరాములుగౌడ్ పాల్గొన్నారు.

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర్‌రావు

జహీరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: జహీరాబాద్ మున్సిపల్ కమీషనర్‌గా ఉమా మహేశ్వర్‌రావు మంగళవారం పదవీ బాధ్యులు చేపట్టారు. మున్సిపల్‌లో ఇంత వరకు కమీషన్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళుతున్న శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఉమామహేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు.ఖమ్మ జిల్లా మణుగూరు మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహించిన ఉమా మహేశ్వర్‌రావు జహీరాబాద్ మున్సిపాలిటీకి బదిలీ కావడంతో మంగళారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు కమీషనర్‌గా సేవలు అందించిన శ్రీనివాస్‌రెడ్డి మెదక్ మున్సిపల్ కమీషనర్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వర్‌రావుకు మున్సిపల్ సిబ్బంది, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్ నామారవికిరణ్ తదితరులు శాలువాతో సత్కరించి ఘనంగా ఆహ్వానం పలికారు.



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న అధికారి సుజాత

పామాయిల్ సాగుతో లాభాలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 29,ప్రభాతవార్త: రైతులు పామాయిల్ సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని హార్టీ కల్చర్ అధికారి సూజాత తెలిపారు. మంగళవారం మండల పరిధి సూరారం గ్రామంలో భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ అధికారులు గ్రామస్తులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు చేసుకునే రైతులకు రాయితీ ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రామక్రిష్ణారెడ్డి, రాజ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

జంగరాయిలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని తూకం వేయాలని మండల పరిధి జంగరాయి రైతులు ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు పేరుకుపోయాయని, నాలుగురోజుల క్రితం ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభిస్తున్నామని చెప్పి నిర్వాహకులు ఫొటోలు దిగారని, ధాన్యాన్ని ఇప్పటివరకు తూకం వేయకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.

నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన లక్ష్మీప్రసన్న



లక్ష్మీప్రసన్నను సన్మానిస్తున్న ఎంఇవో యాదగిరి, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన కోదండ లక్ష్మీప్రసన్న నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గాంధీ నేచురాపతి మెడికల్ కాలేజీలో ప్రభుత్వ సీటును సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మండల విద్యాధికారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, విద్యా కమిటీ చైర్మన్ కర్రె వెంకటేశంతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి నీట్‌లో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావడం హర్షణీయమని అన్నారు.

విద్యార్థిని అభినందించిన మంత్రి

విద్యార్థిని అభినందిస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : మండలంలోని బల్లునాయక్ తండాకు చెందిన లావుడ్యదేవి సిద్దిపేటజిల్లా మిట్టపల్లి సురభి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించడంపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పోతారం గ్రామంలో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి విద్యార్థినిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.నిరుపేద కుటుంబానికి చెందిన లావుడ్య లక్ష్మీ,రమేష్‌ల రెండవ కూతురు డాక్టర్ సీటు సాధించడం సంతోషంగా ఉందని వారు నిరుపేద కుటుంబానికి చెందిన వారని తన దృష్టికి వచ్చిందని ఆమె చదువుకు విషయంలో కావాల్సిన సహాయంతో పాటు వారికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రతీ ఇంట్లో జ్ఞానజ్యోతి వెలగాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29,ప్రభాతవార్త : దీపావళి పర్వదినం రోజున ప్రతీ ఇంట్లో జ్ఞానజ్యోతి వెలగాలని త్రైత సిద్ధాంత ప్రభోదసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక హుజురాబాద్ కమిటీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం త్రైత సిద్ధాంత ప్రభోదసేవా సమితి,ఇందూ జ్ఞానవేదిక సభ్యులతో కలసి హుస్నాబాద్ మండలంలోని పందిల్లతో పాటు హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ దీపావళి ప్రతీ కుటుంబంలో శ్రీ స్వామి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర భగవానుని ఆశీర్వాదంతో ఆనందోత్సవాల మద్య జరుపుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు భగవద్గీత గురించి తెలుసుకోవాలని ప్రచారం నిర్వహించారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో క్రీడాకారులు పోటీ పడుతున్న దృశ్యం

జిల్లా స్థాయి క్రీడల్లో మెదక్ హవేలి ఘనపూర్ విజయకేతనం

పాపన్నపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త: మండల కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ క్రీడలోల మెదక్ హవేలి ఘనపూర్ మండలాలు మొదటి స్థానాల్ని దక్కించుకున్నాయి. క్రీడల్లో భాగంగా మొదటి రోజు బాలుర అండర్ 14, అండర్ 17విభాగాల్లో కబడ్డీ పోటీలు కొనసాగాయి. అండర్ 14 విభాగంలో హవేలి ఘనపూర్, అండర్ 14 విభాగంలో మెదక్ మండలం మొదటి స్థానాల్లో నిలిచాయి. రెండో స్థానంలో అల్లాదుర్గం మండలం నిలచింది. మొదటిరోజు మెదక్ జిల్లా 20 మండలాల పరిధిలోని క్రీడాకారులు పోటీలో తలపడ్డారు. రెండవ రోజు బుధవారం అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలికలకు కబడ్డీ పోటీలు ఉంటాయని పీడి రమేష్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకుగాను మైకులు, టెంట్లు స్థానిక నాయకులు నిలలక్షప్ప, గౌస్ సమకూర్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ జి రమేష్, జిల్లా పిఈటి సంం అధ్యక్షులు ఎస్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, పిడిలు రమేష్, ఎస్ చంద్రమోహన్, డి రవి మాధవ్‌రెడ్డి, మధుసూదన్, కిరణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, అశోక్, మహిపాల్, రాజేందర్, రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

కొమురవెల్లి, అక్టోబరు 29, ప్రభాతవార్త : మండల కేంద్రానికి చెందిన ముత్యం భవానీకి ప్రభుత్వంనుంచి మంజూరైన రూ.11500 సిఎం సహాయ నిధి చెక్కును బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ మంగళవారం అందజేశారు. సిఎంఆర్ఎఫ్ చెక్కును వెంటనే బ్యాంకు ఖాతాలో జమచేసుకోవాలన్నారు. సిఎం సహాయ నిధి చెక్కు మంజూరుకు సహకరించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులుగౌడ్, కొండ శ్రీధర్, ముత్యం నాగరాజుగౌడ్, బైరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ

గజ్వేల్ టౌన్, అక్టోబరు 29 (ప్రభాతవార్త): పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద ప్రతి మంగళవారం నిర్వహించే పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని బొజ్జ సంతోష్‌కుమార్, శాలిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల మహేందర్, కైలాస ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాత బొజ్జ సంతోష్‌కుమార్ దంపతులను శాలువాతో సన్మానించారు.

ఘనంగా ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలు

కొండపాక, అక్టోబరు 29, ప్రభాతవార్త: కుకునూరుపల్లి మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలోకుకునూరుపల్లిలో తొలిసారి ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలను మండల అధ్యక్షుడు నేలపొగుల రాజకుమారి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, అ సంఘం మండల ఉపాధ్యక్షుడు సంపత్, కోశాధికారి హరీష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి



వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమయిందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పండించిన ధాన్యాన్ని డ్రైడర్స్ తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శికి వినతీ పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందుకూరి సతీష్, గోపగోని అరవింద్‌తో పాటు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సాదియా, అక్కన్నపేట మెడికల్ ఆఫీసర్ సుజాత అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ ఆయుర్వేద వినోత్సవం సందర్భంగా యోగా డే నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుర్వేదం ప్రాముఖ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చుటుపక్కలఉన్న మొక్కలలో ఉండే ఔషధ గుణాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజుతో పాటు ఫార్మాసిస్టు రాజమణి,పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గోతులు తీశారు..పనులు నిలిపేశారు

-అవస్థలు పడుతున్న భక్తులు, ప్రజలు

ఝరాసంగం, అక్టోబరు 29, ప్రభాతవార్త: అధికారుల అలసత్వంతో భక్తులు, ప్రజలు పాట్లు పడుతున్నారు. పనులు ప్రారంభించి ఆపేయడంతో ప్రజలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ఇదేదో మారు మూల గ్రామంలో అనుకుంటే పప్పులో కాలేసినట్లే. నిత్యం వేలాది మంది భక్తులు ఆయా ప్రాంతల నుంచి శ్రీ కేతకి సంగమేశ్వరుడి దర్శనానికి వచ్చే మండల కేంద్రమైన ఝరాసంగంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబ

అందుబాటులో శనగ విత్తనాలు

విడుదల చేస్తున్న వ్యవసాయ అధికారులు

జిల్లెడుచౌదరిగూడ,అక్టోబరు 29,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆగ్రోస్, డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రంలో శనగవిత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శనగ పంటకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెజి 11శగన విత్తన రకంతో రైతులు అధిక దిగుబడి తీయవచ్చని తెలిపారు. 25 కిలోల బ్యాగు రూ.2250 ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విత్తన పంటకాలం 100 నుంచి 105 రోజులు ఉంటుందని ఆయన పెర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత ఆగ్రోస్, డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రాల ద్వార తీసుకువెళ్లాలని సూచించారు.. ఏఈఓలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లెడుచౌదరిగూడ, అక్టోబరు 29,(ప్రభాతవార్త): బావి తరాలను తీర్చిదిద్దే విద్యార్థుల భవిషత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. మంగళవారం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులుపాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులు ఎక్కడికి బదిలీపై వెళ్లిన అక్కడున్న విద్యార్థులు తమ పిల్లలుగా భావించి విద్యాబోధన చేయాలని అన్నారు. విద్యార్థి దశలో విద్యా బోధన మంచిగా చేస్తే వారు జీవితంలో మరిచిపోలేరని అన్నారు. పాఠశాల నుంచి నిర్మల, లక్ష్మీప్రసన్న, స్వాతి, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డిలు బదిలీపై వెళ్లారు. సన్మాన కార్యక్రమంలో నీలమౌల్‌నాయక్, శివలింగమ్మ, మహేష్, చందర్‌నాయక్, మాలతీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగరీత్యా బదిలీలు సర్వసాధారణం

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానం

బొంరాస్‌పేట్,అక్టోబర్29,ప్రభాతవార్త ః ఉద్యోగరీత్యా బదిలీలు సాధారణం అని ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పుమళ్ళ నుండి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానకార్యక్రమంలో చౌదర్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్‌గౌడ్ అన్నారు.ఉపాధ్యాయులకు విడ్కోలు సమావేశంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు.ప్రతి ఉద్యోగి వృత్తి రీత్యా బదిలీ అనేది సాధారణం అని ప్రతి పాఠశాలలో నిబద్ధతతో పని చేయడంతో మంచిగుర్తింపు వస్తుందన్నారు.బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్ళిన ఉపాధ్యాయులు నీలకంఠం, సురేష్, శ్రీనివాస్‌లకు పూలదండ, శాలువలతో గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. వారు పాఠశాలకు గత రెండు సంవత్సరాలుగా అందించిన గ్రామప్రజలు,పెద్దలు కొనియాడారు. అనంతరం నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్,సర్దార్ అలీ,కిషన్ నాయక్‌లను కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు అంజిల్‌రెడ్డి,మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకట రాములుగౌడ్,మాజీ రైతుబంధు అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యాదగిరి,ఏఏపీసీ చైర్మన్ వసంత ,పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు అనిల్‌కుమార్,ప్రధానకార్యదర్శిశశీధర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ అనంతయ్య,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్,అక్టోబర్29,ప్రభాతవార్తః బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కాంగ్రేస్‌పార్టీ నాయకులు అంజిల్‌రెడ్డి, వెంకట్ రాములుగౌడ్‌తెలిపారు.ఈసందర్భంగావారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు కొండంత అండ అని పేదలు కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్యం చేసుకునేందుకుగాను సీఎంఆర్ఎఫ్ ఉపయోగ పడుతుందన్నారు.ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన బోయిని పద్మమ్మ, బుడగజంగం చంద్రమౌళిలకు మంగళవారం చెక్కులను పంపిణీ చెయడం జరిగిందని తెలిపారు. లబ్దిదారులు,నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 29) : గిరిజన సమస్యలపై ఖమ్మంలో నవంబర్ 5,6న జరిగే గిరిజన రాష్ట్ర సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరామ్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణం లోని గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోగిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని,వాటి పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, సమస్యల పరిష్కారం కోసంప్రతి జిల్లాలో సమావేశం ఏర్పాటు చేస్తు న్నట్లు వారు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించి, రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్డ్‌లో చేర్చడంతోపాటు రాష్ట్రంలో గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లుఅమలుచేయాలని కోరారు.రిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, నాయకులు హీరూ నాయక్, పాల్గొన్నారు.

వివాదంలో షాద్‌నగర్ మున్సిపాలిటీ

సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే గైర్హాజరు
హాజరైన బిఆర్ఎస్ కౌన్సిలర్లు
ఏకపక్ష సభ నిర్వహణపై కాంగ్రెస్ కౌన్సిలర్ల అసంతృప్తి
మున్సిపల్ నిధుల కేటాయింపు అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

షాద్‌నగర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం దృశ్యం

షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 29) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ మున్సిపాలిటీలో బీఆర్ఎస్,కాంగ్రెస్‌పార్టీల పరంగా కౌన్సిలర్లు చీలి పోయారు. మంగళవారం జరిగిన పట్టణ మున్సిపల్ సర్వసభ్య సాధారణ సమావేశం బీఆర్ఎస్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏకపక్షంగా జరగడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు అసంతృప్తికి గురయ్యారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం సమావేశానికి హాజరుకాలేదు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు పూర్తికోరం ఉండడంతో మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఇతర కారణాల చేత మున్సిపల్ కమిషనర్ సైతం హాజరు కాకపోవడం గమనార్హం. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతో కలిపి దాదాపు 16 మంది హాజరుకాగా మిగతా కాంగ్రెస్ కౌన్సిలర్లు, మద్దతుదారులు హాజరు కాలేదు.

ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎం.డి.సర్వర్‌పాష, కె.శ్రావణిలు మున్సిపల్ పాలకవర్గం తీరుపై మండిపడ్డారు. ఎవరికి అవసరమైన ఆర్థిక అవసరాల పరంగా పనులు కేటాయించుకొని తీర్మాణాలు ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. అవసరం లేని పనులకు అనవసరంగా లక్షలాది రూపాయల నిధులు కేటాయించి కొందరు కమీషన్ల కోసం దందా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ప్రవేశపెట్టిన అభివృద్ధి ఎజెండాలో ఎన్నో అవకతవకలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అడ్డగోలుగా బిల్లులు రాసి నిధుల కైంకర్యం కోసం తీర్మాణాలు జరుగుతున్నాయని, నిధుల అక్రమాలపై అడ్డగోలు వాడకాలపై విజిలెన్స్ అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. చేసేది పనులు గోరంత.. నిధులు ఖర్చుచేసేది కొండంత అన్న విధంగా నిధులు కాజేస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇండ్లల్లో సొంతపనులు చేయించుకుంటూ సిబ్బందికి కార్యాలయ సొమ్మును జీతంగా ఇస్తున్నారని, డ్రైవర్ల నుండి మొదలుకొని మరెన్నో విషయాల్లో ప్రజా సొమ్ము పక్కదారి పడుతుందని సాక్షాధారాలతో సహా జిల్లా కలెక్టర్‌తో పాటు విజిలెన్స్, ఏసీబీ శాఖలకు ఫిర్యాదు చేయబోతున్నట్లు మహిళ కౌన్సిలర్ శ్రావణి పేర్కొన్నారు.

అక్రమ రవాణా నిర్మూలనలో జాగృతి సంఘాల పాత్ర కీలకం

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ సభ్యులు

షాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త : మానవ అక్రమ రవాణా నిర్మూలనలో సమాజ జాగృతి సంఘాల పాత్ర కీలకమని ప్రజ్వల ఎన్‌జివో స్టేట్ సీనియర్ ప్రాజెక్ట్‌మేనేజర్ బలరామ కృష్ణ, మహిళా శిశుసంక్షేమ శాఖ ఇంచార్జీ సీడీపీవో సునీత అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ చేవెళ్లప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో హాల్‌లో సమావేశం రెండురోజుల పాటు శిక్షణా కార్యక్రమంలో భాగంగా డాక్యు మెంటరీస్ ద్వారా మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. అనంతరం మానవ అక్రమ రవాణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ప్రజ్వల ఎన్‌జివో స్టేట్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతోమంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. పేద, మధ్యతరగతి వారు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో గ్రామాల నుండి అమ్మాయిలను తీసుకుని వెళ్లి, ముంబై, పూణె, కలకత్తా, గోవాలాంటిప్రదేశాలలో వ్యభిచారం నిర్వహణలో అమ్ముతున్నారన్నారు. కావున అందరు శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను సమాజంలో తెలిజేసి అవగాహన కల్పించాలన్నారు.

ఐసిడిఎస్ ఇంచార్జి సిడిపివో సునీత మాట్లాడుతూ...

మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ఐసీడీఎస్, ప్రజ్వల ఎన్‌జీవో ద్వారా ఇచ్చిన ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ టీచర్ తమపరిధిలోని బాలికలు, మహిళలు, అబ్బాయిలకు అక్రమరవాణాపై అవగాహన కల్పించాలన్నారు. ఏవైన సమస్య లుంటే టోల్‌ఫ్రీ నెం.1098, ఎమర్జెన్సీ నెం.1930(సైబర్ ట్రాఫికింగ్)లను వినియోగించాలన్నారు. ప్రజ్వలకో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, సూపర్‌వైజర్‌లు సృజనరాణి, పారిజాత, శ్రీలక్ష్మి, రమాదేవి,ప్రజ్వల ప్రతినిధులు అంబర్‌సింగ్, మితాళిరాజ్, చెన్నకేశవ్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులపై అభిమానంతో విగ్రహాల ఏర్పాటు

తల్లిదండ్రుల విగ్రహాలను తయారు చేయించిన అన్నదమ్ములు

కొడంగల్,అక్టోబరు 29ప్రభాతవార్త :కనిపెంచిన తల్లిదండ్రులపై అభిమానంతో ఇద్దరు అన్నదమ్ములు తమ తల్లిదండ్రు విగ్రహాలను ఏర్పాటు చేశారు.వివరాల్లోకి వెళితే..కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మమ్మ,గొల్ల బుగ్గప్ప దంపతులు మృతిచెందారు.ఈక్రమంలో తమ తల్లిదండ్రులపై అభిమానంతో వారి కుమారులు గొల్ల తిమ్మప్ప,గొల్ల మల్లప్పలు రూ.2లక్షల వ్యయంతో తమ తల్లిదండ్రులపై అభిమానంతో వారి విగ్రహాలను తయారు చేయించి మంగళవారం తమ వ్యవసాయ పొలంలో విగ్రహాలకు పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.కనిపెంచిన తల్లిదండ్రులను వృధ్యాప్యంలో పట్టించుకోని తరుణంలో తల్లిదండ్రులపై అభిమానంతో వారి విగ్రహాలను తయారు చేయించి పూజలు చేయించడం పట్ల గ్రామస్దులు హర్షం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ప్రభాతవార్త, అక్టోబరు 29 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారంవ్యవసాయకార్మికసంఘం డివిజన్ స్థాయి సెమినార్‌ను మూనివర్సల్ మినీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని అన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కట్టి ప్రజలకు ఇచ్చిన హామీలైన ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, రైతు రుణమాణీ,అన్నిటినీ నెరవేర్చుకుంటూ పోతున్నామని అన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూంలను పూర్తి చేసి ప్రజలకు అందజేస్తామని, పెంచిన పింఛన్ల పంపిణీ, మహిళలకు 2500 నగదు,తదితర హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, బాలమల్లేష్, పాలమాకుల జంగయ్య, బాగాల నరసింహ్మ, రమేష్, ఎం.కృష్ణ, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ, పాల్గొన్నారు.

ఉపాధిహామి పనుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

దోమ,అక్టోబరు 29 ప్రభాతవార్త: ఉపాధిహామి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవనిజాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ఏపిడి సరళకుమారి తెలిపారు.దోమ మండల కేంద్రములోని ఉఎధిహామి పథకం భవనం ఆవరణలో ఉపాదిహామి పథకంలోచేపట్టిన పనులపై సామాజిక తనిఖీకార్యక్రమములోపాల్గొన్నారు.యంపిడివోమహేశ్‌బాబు మాట్లాడుతూ మండలములోని ఉపాదిహామి పథకంలో ఒక సంవత్సరములో 36గ్రామ పంచాయతీల్లో 806 పనులకుగాను5,42,67085 రూపాయలు, మెటిరియల్‌లకు62,15071 రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని అన్నారు.గ్రామాల వారిగా చేసినపనులు, తనిఖీ చేసిన పనులపై అందరి సమక్షములోచదివి వినిపించారు.సిటి జయరాం,డివివో బార్గవి, తహాసిల్‌దార్ పురుషోత్తం,ఎస్ఆర్పిగంగారాం,ఏవో ప్రబాకర్, సూపరిడెంట్ నరేందర్,ఏపివో దస్తయ్య,ఈసి చంద్రశేఖర్,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామి సిబ్బందిపాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

షాబాద్ మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్

పార్టీ సభ్యత్వం నమోదు చేస్తున్న బిజెపినాయకులు

షాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని చేవెళ్ల సభ్యత్వ ప్రబారి వికారాబాద్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలో షాబాద్ మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బిజెపి సభ్యత్వ నమోదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....బూత్ స్థాయిలో కార్యకర్తలు సభ్యత్వాలు అధికంగా చేసి పార్టీని అభివృద్ధి చేయాలన్నారు. బూత్ బలంగా ఉంటేనే రాబోవు రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడం సాధ్యమన్నారు. సభ్యత్వం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బూత్ అధ్యక్షులు వినయ్, లంబడి రాజు, రాజేష్, ప్రశాంత్, విజయ్, అనిల్ తదితరులు ఉన్నారు.

డిఎ.పిఆర్సీలను వెంటనే చెల్లించాలి

ఉపాధ్యాయ సంఘం నాయకుల డిమాండ్

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

షాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం షాబాద్ మండల మాజీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్, జీపీఎఫ్, పెన్షన్ తదితర ఇప్పటికి పెండింగ్‌లో ఉన్న అనేక బిల్లులను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం నవంబర్ 23న ఛలో ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయ ధర్మగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు సుభాష్‌రెడ్డి, గోపాల్, సంగమేశ్వర్‌రెడ్డి ఉన్నారు .

క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవాబుపేట, అక్టోబరు 28, ప్రభాతవార్త : నేడు చేవెళ్ళలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలెయాదయ్య చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్యాంపుకార్యాలయ అధికారులు మంగళవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. మండలానికీ సంబంధించిన 14 మంది లబ్ధిదారులకు 6.19.500 లక్షల రూపాయల చెక్కులను అందజేయనున్నట్లు వారు తెలిపారు.యావపూర్ గ్రామానికి చెందినఎం విజయలక్ష్మికి 28.000 రూపాయలు, గుల్లా గూడకు చెందిన పీఎల్లారెడ్డికి 35.000రూ, ఎక్‌మామిడికి చెందిన సుబ్రమణ్యాచారికి 60.000, అదే గ్రామానికి చెందిన కులసం బేగంకు 12.000 ఎల్లకొండకు చెందిన డీ గౌరమ్మకు 60.000 రూ, దాతపూర్‌కు చెందిన ఎన్ లలితకు 50.000 రూ, నాగిరెడ్డిపల్లికి చెందిన జీనర్సింలుకు 37. 500 రూ, చించల్ పేటకు చెందిన వీ కీర్తనకు 50.000 రూ, మహ్మదాన్ పల్లికి చెందిన వై రమేష్‌కు 37.000, కేశవపల్లికి చెందిన ఎం నారాయణరెడ్డికి 60.000, లదేగ్రామానికి చెందిన జీ. ప్రణీత్‌గౌడ్‌కి 36.000, వి.భీమయ్యకు34.000,చిట్టిగిద్దకుచెందిన వైరమేష్‌కు 60.000,పులుమామిడి గ్రామానికి చెందిన కె ఆండాళుకు 60.000 రూపాల చొప్పునసీఎంఆర్ఎఫ్ నిధులుమంజూరైనట్లువారు తెలిపారు.

ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలి: డిఇఇ సుబ్రమణ్యం

వాటర్ సరఫరాపై అవగాహన కల్పిస్తున్న డిఇఇ సుబ్రమణ్యం

పూడూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త : ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందేలాచూడాలని మిషన్‌భగీరథ డిఇఇ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో మిషన్ భగీరథ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటికి పరిశుభ్రమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సుచించారు.గ్రామాలకు సరఫరాఅయ్యే పైపులైన్లను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించి లీకేజీలు కాకుండా చూడాలని వివరించారు. ఎఇ విపుల్ ఆయా గ్రామాల మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రిన్సిపాల్ స్నేహలత

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ స్నేహలత తదితరులు.

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 29, ప్రభాత వార్త: ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ క్రీడాపోటీల్లోరాణించేందుకు క్రీడా విద్యార్థులు మహింద్ర హిల్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత అన్నారు. ఇటీవల ఉస్మానియా యూనివర్శిటీలో జరిగిన పది కిలోమిటర్ల క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహింద్ర హిల్స్ డిగ్రీ కళాశాల బాలికలు ఎం.మల్లిక స్వర్ణ పతకం, ఎన్. అనుషా రజత పతకం సాధించినట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల అధ్యాపక బృందం మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూఓయూకళాశాలక్రాస్‌కంట్రీ మహిళల టీం ఛాంపియన్ షిప్ టైటిల్‌ను మహింద్రహిల్స్‌డిగ్రీ కళాశాల సొంతం చేసుకున్నట్లు తెలిపారు. వచ్చేనెల18,19 తేదిలలో కర్ణాటకలోని మంగళూరు యూనివర్శిటీలో జరిగే ఆలిండియాస్థాయిలోజరిగేక్రీడాపోటీల్లో రాణించేందుకు క్రీడా విద్యార్థులు సన్నద్దం కావాలని అన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూఎరాణి, డాక్టర్ అనురాధ, డాక్టర్ మోహిని, విజయలక్ష్మి, జి.సుమలత, కె.శ్వేత, కవిత, వి.జ్యోతి, వసంత, అథ్లెటిక్స్ కోచ్ బిక్షపతి పాల్గొన్నారు.

నాగారంలో అగ్ని ప్రమాదం

ప్రమాదానికి గురైన స్పీకర్లు, వైర్లు

ధారూర్,అక్టోబరు 29,ప్రభాతవార్త; మండల పరిధిలోని నాగారం గ్రామంలో సోమవారం నాడు రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలో శ్రీలక్ష్మి డీజె డెకరేషన్ షాపులో భారీగా అగ్ని ప్రమాదం జరిగింది. ఇందులో స్పీకర్లు, డెకరేషన్ బట్టలు వైర్లు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో షాపులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇందులో విలువైన వస్తువులు, రూ2 లక్షల వరకు నష్టం జరిగిన్నట్లు యాజమాని నవీన్ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

నేరాల నియంత్రణలో సిసి కెమేరాల పాత్ర కీలకం

సిసి కెమేరాలను ప్రారంభిస్తున్న ఎస్‌పి

పెద్దేముల్,అక్టోబరు 29, ప్రభాతవార్త: నేరాల నియంత్రణలో సీసీ కేమేరాలు కీలకపాత్ర పోషిస్తాయని వికారాబాద్ జిల్లా ఎస్‌పి కే.నారాయన్‌రెడ్డిఅన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం నాగులపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కేమేరాలను ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పినారాయన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కేమేరాలు ప్రధాన భూమిక పోషిస్తాయని అన్నారు. ఒక్కో సీసీ కేమేరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. పోలీసు కేసుల దర్యాప్తులో సీసీ కేమేరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. నేరాల నియంత్రణలో సీసీకేమేరాలుఎంతోగానో దోహదపడతాయని అన్నారు. ఇళ్ళముందు, దుకాణాల ముందు సీసీ కేమేరాలు ఏర్పాటుచేసుకుంటే తమ ఇళ్ళకు, దుకాణాలకు ఎంతో భద్రత ఉంటుందని అన్నారు. సీసీ కేమేరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గాయని, అందుకు గ్రామాలలో తప్పనిసరి సీసీ కేమేరాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలోడిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి, రూరల్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ గిరి,నాయకులు పొట్టిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలం